క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

లింగాల : మండలంలోని పార్నపల్లె 33 కె.వి విద్యుత్ ఫీడర్‌లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కర్ణపాపాయపల్లె 11 కె.వి విద్యుత్ ఫీడర్‌లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ బాల సంజీవులు తెలిపారు. వెలిదండ్ల 11కె.వి ఫీడర్‌లో మిడల్ విద్యుత్ స్తంబాల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈ విషయాన్ని ప్రజలు, రైతులు గమనించి సహకరించాలన్నారు.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సత్కారం



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురంలోని తన నివాసంలో మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎర్రగుంట్ల, ముద్దనూరు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎర్రగుంట్ల మండల జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమ్మిశెట్టి బాలయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి, ముద్దనూరు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డిలకు పార్టీ పదవులు వచ్చిన సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి వారు సత్కరించారు.

సమస్యలు పరిష్కరించండి

పెద్దముడియం : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ కె.కె.సుధ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాయంలో మండల సర్వసభ్య సమావేశంను ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో షంషాద్‌బాను మాట్లాడుతూ రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. జె.కొత్తపల్లె, ఉలవపల్లె, ఎన్.కొట్టాలపల్లె, మేడిదిన్నె గ్రామాల్లో నీటి సమస్య ఉందని అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని గ్రామాల సర్పంచ్‌లు అధికారులను కోరారు. అనంతరం పలు శాఖల అధికారులు గడచిన మూడు నెలల కాలంలో జరిగిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల నరసింహులు, ఏవో అరుణ, ఎపీవో వెంకటసుబ్బయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వీరపునాయునిపల్లె : నేటి నుంచి ఈనెల 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల పశు వైద్య అధికారి సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శిబిరాల్లో భాగంగా మొదటి రోజు ఉరుటూరు గ్రామంలో నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో సూటి పరీక్షలు 32, ఇన్‌ఫర్టిలిటి 19, నట్టల నివారణ మందులు 38 దూడలకు, 342 గొర్రెలకు అందిస్తామన్నారు. 22న మొయిళ్లచెరువు, 23న రాజుపాలెం, 24న అలిదెన ఓబాయపల్లె, 25న ఇందుకూరు, 27న ఎస్.పాలగిరి, 28న కొమ్మద్ది, 29న అడవిచెర్లోపల్లె, 30న గంగిరెడ్డిపల్లె, 31న వీరపునాయునిపల్లెల్లో నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలకు గొర్రెల కాపరులు, పాడి పశువుల కాపరులు తమ పశువులను తీసుకువచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన తెలిపారు. సర్పంచ్ లక్ష్మీదేవి, ఎర్రగుంట్ల పశు వైద్యాధికారి మునెయ్య, గంగిరెడ్డిపల్లె వైద్యాధికారిణి సుస్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులకు స్వేచ్ఛలేకుండా చేస్తున్నారు



ఇమ్మానియేలును అరెస్టు చేసి జీపులో ఎక్కించుకుని పోతున్న పోలీసులు

జమ్మలమడుగు : రెవెన్యూ అధికారులు తీరుకు నిరసనగా విజయవాడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చిన తమని అరెస్టు చేయడం అన్యాయమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామోజీ ఇమ్మానియేల్ తెలిపారు. మంగళవారం సాయంత్రం విజయవాడకు బయలుదేరుతున్న ఇమ్మానియేలును జమ్మలమడుగు పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. దీంతో దళిత నాయకులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇమ్మానియేలు మాట్లాడుతూ కడప కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు దళితులపై వివక్ష చూపుతు దళితుల సమస్యలను పరిష్కారం చేయడంలేదన్నారు. దీంతో తమ హక్కులను కాపాడుకోవడం కోసం రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. దీంతో పోలీసులు తమని అరెస్టు చేయడం సరైంది కాదన్నారు.

వేధిస్తున్న తాగునీటి సమస్య



తాగునీటికి ఇబ్బంది పడుతున్న నల్లపురెడ్డిపల్లె

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో రోజు రోజుకు తాగునీటి సమస్య వేధిస్తుండటంతో గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నల్లపురెడ్డిపల్లెలో 860 కుటుంబాల వారు నివసిస్తున్నాయి. నీటిని సరఫరా చేసే వాటర్ లైన్ మెన్ ఎప్పుడు నీరు వదులుతాడో చెప్పడంలేదంటున్నారు. నల్లపురెడ్డిపల్లెకు ఎప్పుడు నీరు వదిలే రోజులను ప్రకటిస్తే అప్పుడు మాత్రమే నీరు పట్టుకుంటామని స్థానిక ప్రజలు అంటున్నారు. నీటిని విడుదల చేసే లైన్‌మెన్లు కూడా అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు.

నీటిని వదిలే తేదీలను ముందే చెప్పాలి



ఎర్రబల్లె పంచాయతీ పరిధిలోని నల్లపురెడ్డిపల్లెలో తాగునీటి సమస్యలు రాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. గ్రామంలో నీటిని విడుదల చేసే తేదీలను, వారాలను ముందుగానే చెబితే నీటిని పట్టుకుంటాము. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– విష్ణురెడ్డి, స్థానికుడు, నల్లపురెడ్డిపల్లె

నీటిని ఎప్పుడు వదులుతారో తెలియడంలేదు



నల్లపురెడ్డిపల్లిలో నీటిని ఎప్పుడు వదులుతారో తెలియకపోవడంతో నీరు వదిలినప్పుడు ఇంటిదగ్గర లేకపోవడంతో నీరు ఎక్కువగా వృథా అవుతోంది. ఎప్పుడు వచ్చేది తెలిస్తే నీరు వచ్చినప్పుడు మాత్రమే ఇళ్ల దగ్గరుండి నీటిని వృథా కాకుండా నీటిని పట్టుకుంటారు.

– తులశమ్మ, స్థానికురాలు, నల్లపురెడ్డిపల్లె

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



జంగంపల్లెలో పశువులకు వైద్యం అందిస్తున్న పశు వైద్యాధికారిణి శివజ్యోతి

కమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పందిళ్లపల్లె, పెద్దచెప్పలి పశు వైద్యాధికారులు మల్లికార్జునరెడ్డి, శివజ్యోతి తెలిపారు. మంగళవారం పందిళ్లపల్లె, జంగంపల్లెలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన పశువులకు వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పశు ఆరోగ్య శిబిరాల్లో భాగంగా కమలాపురంలో నిర్వహిస్తున్న శిబిరాలను పాడి పరిశ్రమ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాలలో ఉచితంగా వైద్యం అందించడంతో పాటు తేలికపాటి శస్త్ర చికిత్సలు, ఎదకు రాని, చూలు కట్టని పశువుల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు, పశువులు, దూడలు, సన్న జీవాలకు నట్టల నివారణ మందు తాపిస్తామన్నారు. గొర్రెలకు ఉచితంగా బొబ్బ వ్యాధి నివారణ టీకాలు అందిస్తామన్నారు. అనంతరం పశు పోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కాగా పందిళ్లపల్లెలో 20 పశువులకు సాధారణ చికిత్సలు, 5 గర్భకోశ వ్యాధి చికిత్సలు, 60 పశువులతో పాటు 198 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును అందజేశారు. అలాగే జంగంపల్లెలో 14 గర్భకోశ చికిత్సలు, 3 ఎద సూదులు, 45 లేగ దూడలకు ఏలికపాము మందులు, 142 జీవాలకు నట్టల నివారణ మందులు, 9 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, 61 సాధారణ కేసులకు వైద్యం చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

శనగలో పంట కోత ప్రయోగం

పెద్దముడియం : మండలంలోని పెద్దముడియం గ్రామంలో మంగళవారం అధికారులు శనగలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారులు, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ అధికారులు సంయుక్తంగా శనగ పంటలో పంట కోత ప్రయోగాన్ని నిర్వంచారు. పెద్దముడియం గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి, సురేష్‌రెడ్డి పొలంలో 5 మీటర్లు పొడవు, 5 మీటర్లు వెడల్పుపరిమాణంలో శనగ పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. పంట కోత ప్రయోగంలో 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు మండల వ్యవసాయాధికారి అరుణ తెలిపారు.

నేడు నిర్వాసితుల ఆధార పత్రాల పరిశీలన

కొండాపురం : గండికోట జలాశయం కింద ముంపునకు గురైన పెంజి అనంతపురం గ్రామ నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ గజిట్‌లో పేర్లు నమోదులో ఉన్న నిర్వాసితుల ఆధార పత్రాలను నేడు పరిశీలిస్తున్నట్లు మండల తహసీల్దార్ గురప్ప మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి 5 గంటల వరకు జమ్మలమడుగులోని సభావనంలో నిర్వాసితుల గుర్తింపు, ఆధార పత్రాలతో బియ్యంకార్డు, ఆధార్ కార్డు, ఒటర్‌కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం, విద్యార్హత ధృవీకరణ పత్రాలతో ఎవరైతే గతంలో హాజరుకాలేదో వారు హాజరుకావాలన్నారు. ఎవరికి కేటాయించిన కొంటర్‌లో ఆధార పత్రాలు సమర్పించాలన్నారు. తప్పుడు పత్రాలు సర్పించినవారిపై క్రిమినల్ చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్న నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె : వరి, వేరుశనగ పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని తంగెడుపల్లె, ఎస్.పాలగిరి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సాగులో ఉన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. వరి పంట సాగు చేసే పొలాల్లో జింక్ లోపం అధికంగా ఉందని దుక్కిలో జింక్ సల్ఫేట్ వేసుకొని రైతులు తక్షణమే చిలెటెడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వరి పంటలో ప్రతి రైతు తప్పని సరిగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ఆకుముడత, కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిపాస్, 500 మిల్లీ లీటర్లు లేదా క్లోరంతో నిలిప్రోల్ 60 మిల్లీ లీటరు 2 వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ వేరుశనగ పంట పూత దశలో ఉందని ఒక్కో ఎకరాకు 2 వందల కిలోల జిప్సమ్‌ను వేయాలని అలా చేయడం వలన అధిక దిగుబడి సాధించవ్చని తెలిపారు. సేంద్రీయ ఎరువులను వాడటం వలన సూక్ష్మధాతు లోపాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రసాద్ నాయక్, గంగయ్య, రైతులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న థర్మల్ డైరెక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన సంవత్సర డైరీని, క్యాలెండర్‌ను ఏపీ జెన్‌కో థర్మల్ డైరెక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా విద్యుత్ సౌధ నుంచి అవిష్కరించినట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చౌటిపల్లి రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ జెన్‌కో సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై కూడా చర్చించినట్లు తెలిపారు.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత



ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సిద్దయ్య

వేముల : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని కొండ్రెడ్డిపల్లెలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నిల్వలు ఉన్న నీటిలో అబైట్‌ను పిచికారి చేసి ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి రెండుసార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పని సరిగా డ్రైడే పాటించి ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లయితే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమకాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలన్నారు. దోమ కాటు వలన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రెడ్డమ్మ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమేష్, ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్‌ఓ విజయభారతి, ఆరోగ్య, ఆశా కార్యకర్తల పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో విద్య, వైద్య, పారిశుధ్య, విద్యుత్ తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ మెంబర్లు హాజరు కావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తగిన నివేదికలతో హాజరు కావాలన్నారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ కేంద్రాలు

కమలాపురం: కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని 1వ సచివాలయం, టి.చదిపిరాళ్ల సచివాలయాల్లో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం-1 ఆధార్ మొబైల్ కేంద్రంలో పెద్దచెప్పలి డిజిటల్ అసిస్టెంట్ మునికృష్ణ, చదిపిరాళ్ల కేంద్రంలో మధు సూధన్ రావ్‌లు ఆధార్ సేవలు అందిస్తారని, వారికి ఎంఎస్‌కేలు సహాయకులుగా నియమించామన్నారు. వారు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఆధార్ సేవలు అందించాలని ఆమె తెలిపారు. ఈ మొబైల్ ఆధార్ కేంద్రాల్లో 0-5 సం. పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయడంతో పాటు ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు, ఆధార్‌కు పోన్ నెంబర్ లింక్, వేలి ముద్రలు అప్‌డేట్ చేయుట తదితర సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. విద్యార్థులతో పాటు అన్ని వయస్సుల వారు ఈ ఆధార్ మొబైల్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఆధార్ మొబైల్ కేంద్రాలను ఈనెల 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. 22న తోల్లగంగనపల్లె, 23న కొప్పోలు, 24న వల్లూరు, 27న తప్పెట్ల, 28న లేబాక, 29న దుగ్గాయపల్లె, 30న పైడికాలువ గ్రామాల్లో మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో వుంటాయని తెలిపారు. ఇందులో 0 నుండి 6 సంవత్సరాల లోపు అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు, ప్రైమరీ, హైస్కూలు, కాలేజీ విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్, ఆధార్‌లేని వారికి కొత్త ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ కార్డుకు సంబంధించి చిరునామా మార్పు, ఫొటో మార్పు, ఫోన్ నంబర్ లింక్ చేయడం, వేలి ముద్రలు అప్‌డేట్ చేయడం మొదలైన సేవలు అందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చింతకొమ్మదిన్నెలో

చింతకొమ్మదిన్నె : స్థానిక గ్రామ సచివాలయంలో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు, 27 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ నమోదు కేంద్రం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుల్లాయిబాబు తెలిపారు. ఈ ఆధార్ క్యాంప్‌లో డిజిటల్ అసిస్టెంట్‌ను ఆధార్ అప్లికేషన్ నమోదు, వెరిఫికేషన్ అధికారిగాను, మహిళా పోలీసును సహాయకురాలుగా నియమించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో చిరునామా, ఫొటోలను మార్పు చేయుట, ఫోన్ నెంబర్ లింక్ చేయుట, వేలి ముద్రలు అప్డేట్ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. అలాగే మండలంలోని వివిధ పంచాయతీలలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందించే పింఛన్లు గురించి బుధవారం మండలంలోని పింఛన్‌దారుల గురించి పరిశీలన చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

నేడు మండల సమావేశం

ముద్దనూరు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ముకుందరెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరవుతారని ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలకు పరామర్శ



సోమల కొండారెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని దీవిస్తున్న ముల్లా ఖాజాబీ

సింహాద్రిపురం : మండలంలోని పలు వైఎస్సార్‌సీపీ కుటుంబాలను మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పరామర్శించారు.

ఇటీవల వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ జాఫర్ తండ్రి మహ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమల చెన్నకేశవరెడ్డి తండ్రి శివ నారాయణరెడ్డిలు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శకు వచ్చిన ఎంపీని హజ్ యాత్ర చేసి వచ్చిన ముల్లా ఖాజాబీ ఆయనను దీవించింది. అనంతరం ఎంపీ పెరాలసిస్‌తో బాధపడుతున్న సోముల కొండారెడ్డి, వెన్నెముక చికిత్స చేయించుకున్న సాకం వెంకటరామిరెడ్డిల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, అరవిందనాథ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ రామ్మోహన్, ఖాదర్‌వలి, సుదర్శన్‌రెడ్డి, మధుసుదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పటేల్‌రెడ్డి, కేశవరెడ్డి, నీలవర్థన్‌రెడ్డి, నజీర్, బషీర్ మనోహర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, చంద్రహాసరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బోస్‌రెడ్డి, బిలాల్, ద్వారకనాథరెడ్డి, గంగాధర్, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ క్యాలెండర్ల ఆవిష్కరణ



వైఎస్సార్‌సీపీ నూతన సంవత్సర డైరీని ప్రారంభిస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి



వైఎస్ మనోహర్‌రెడ్డికి పార్టీ డైరీ, క్యాలెండర్లను అందిస్తున్న ప్రణీత్‌కుమార్

పులివెందుల రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రణీత్‌కుమార్ రూపొందించిన నూతన సంవత్సర వైఎస్సార్‌సీపీ డైరీ, క్యాలెండర్లను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. అలాగే పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డికి పార్టీ డైరీ, క్యాలెండర్లను అందించారు.

తెగుళ్లపై అవగాహన పెంచుకోవాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ

చక్రాయపేట : రైతులు క్షేత్రస్థాయిలో తెగుళ్లపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయాధికారి నవంత్ బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని కె.రాజుపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన వేరుశనగ పంట సాగు చేసిన రైతుల పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వేరుశనగలో తిక్క, ఆకు మచ్చ తెగుళ్ల సమస్య అధికంగా ఉందన్నారు. రైతులు తమ పంట పొలాను పరిశీలించి తిక్క, ఆకు మచ్చ తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సహాయకులు ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

పులివెందుల రూరల్ : రోడ్డు భద్రతా నియమాలను డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. మంగళవారం ముద్దనూరు రోడ్డులో ఉన్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆయన డ్రైవర్లకు సమావేశం నిర్వహించి కంటి చూపు ప్రాముఖ్యత గురించి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కంటిచూపు బాగుంటేనే డ్రైవింగ్ సక్రమంగా చేయగలరని, రోడ్డు భద్రతా నియమాలను డ్రైవర్లు తప్పకుండా పాటించాలన్నారు. అధికారులు చెప్పే సలహాలు, సూచనలను ప్రతి వాహనాదారుడు తప్పనిసరిగా పాటించాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వాహనాలకు సంబంధించిన లైసెన్సులు, రికార్డులు దగ్గరలోనే ఉంచుకోవాలన్నారు. అలాగే హెల్మెట్లు కూడా తప్పనిసరిగా వాడాలన్నారు. రోడ్డు భద్రత నియమాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు ప్రసాద్, డాక్టర్ ఆంజనేయులు, ఆర్టీసీ అధికారులు శ్రీకాంత్, ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

పంట దిగుబడిపై నివేదికలు



ప్రొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న ఏవో

ముద్దనూరు : మండలంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించి పంట దిగుబడులను అంచనావేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తిమ్మాపురం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పంట సాగుచేసిన రైతులంతా పంట నమోదు చేయించుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీచేసే అన్ని పథకాలకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే పథకాలు లభ్యమవుతాయని ఆయన సూచించారు. రైతులతో కలిసి గ్రామంలో సాగుచేసిన శనగ, ప్రొద్దుతిరుగుడు పంటలను ఆయన పరిశీలించి సలహాలు అందించారు.

కుష్టు వ్యాధికి చికిత్స చేయించుకోవాలి



కుష్టువ్యాధి అనుమానితుల గుర్తింపు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

చింతకొమ్మదిన్నె : కుష్టువ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మూలవంక గ్రామంలో జరుగుతున్న కుష్టువ్యాధి అనుమానితుల గుర్తింపు కార్యక్రమాన్ని జిల్లా కుష్టువ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ రవిబాబు, జిల్లా ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మనోహర్‌లతో కలసి ఆయన పరిశీలించి మాట్లాడారు. జనవరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగే కుష్టువ్యాధి అనుమానితుల గుర్తింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి మూడు వేల బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో ఒక ఆశా కార్యకర్త, ఒక స్వచ్ఛంద కార్యకర్త ఉంటారన్నారు. వారు ప్రతీ ఇంటిని సందర్శించి అనుమానితులను గుర్తిస్తారన్నారు. అనంతరం అనుమానితులను స్థానిక వైద్యులు పరిశీలించి వ్యాధిని నిర్ధారిస్తారని కనుక ప్రజలు ముందుకువచ్చి ఈ బృందాలకు సహకరించాలని ఆయన కోరారు. డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ కుష్టువ్యాధి మైకో బాక్టీరియ లెప్రే అనే సూక్ష్మ క్రిమివల్ల చర్మానికి మరియు నరాలకు వచ్చే వ్యాధి అన్నారు. ఈ జబ్బుతో బాధపడుతున్న వ్యక్తులతో ఎక్కువకాలం కలిసి వున్నప్పుడు ఆరోగ్యవంతులకు సోకే అవకాశం ఉందన్నారు. సకాలంలో వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించడం ద్వారా వారికి జబ్బును నయం చేయచ్చని తెలిపారు. చర్మంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు లేదా మందంగాను జిడ్డు చర్మం తో మెరుస్తూ ఉన్న మచ్చలు లేదా చెవులపై వీపుపై ఎదపై నొప్పిలేని బుడిపెలు పాలిపోయిన దురదలేని మచ్చలు, ముక్కుదూలం అణిగిపోవడం, ముక్కు దిబ్బడ ముక్కునుండి రక్తం కారడం, కాళ్ళు చేతుల్లో జోములు కలిగివుండటం, చల్లని లేదా వేడిని గుర్తించలేక పోవడం, చేతులనుండి వస్తువులు జారిపోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చేతులకు కాళ్లకు బొబ్బలు రావడం, కాళ్ళు చేతులు వంకర్లు పోవడం మొదలైన లక్షణాలు కలిగి ఉంటాయని తెలిపారు. డాక్టర్ విక్టర్ మనోహర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి వల్ల అంగవైకల్యం వచ్చిన వారికి శస్త్ర చికిత్స చేసి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. స్థానిక వైద్యులు రాఘవేంద్ర, సమాజ ఆరోగ్య అధికారి సుకుమార్, పర్యవేక్షకులు, ఆరోగ్య సహాయకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన

వేంపల్లె : కుష్టు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం తెలిపారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన సర్వేలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మైనార్టీ బాలికల హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టి వ్యాధి మైకో బ్యాక్టీరియం లేప్రే అను బ్యాక్టీరియా వలన వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఈ క్రిములు తుమ్మడంవలన, దగ్గడం వలన వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించేందుకు మూడు, నాలుగేళ్ల సమయం పడుతుందన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, చర్మము రంగు మారిన మచ్చలు, కళ్లు పూర్తిగా మూసుకోలేకపోవడం, చెవి తమ్ములు మందంగా మారిపోవడం, చెవి తమ్ములపై బుడిపెలు ఉండటం, తదితర లక్షణాలు ఏవైనా ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సుగుణమ్మ, స్టాఫ్ నర్సు అరుణ, సిహెచ్‌ఓ రమాదేవి, ఏఎన్ఎం నాగ స్వర్ణలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.